క్లుప్తంగా

బండా ప్రకాశ్‌కు మంత్రి పువ్వాడ శుభాకాంక్షలు

ఖమ్మంమయూరిసెంటర్: బడుగు, బలహీన వర్గాల నాయకులు బండా ప్రకాశ్ తనకున్న రాజకీయ అనుభవం, పరిజ్ఞానంతో డిప్యూటీ చైర్మన్ పదవికి మరింత వన్నె తేవాలని, తెలంగాణ శాసనమండలి ప్రతిష్టను పెంచాలని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ ఆకాంక్షించారు. శాసనమండలి డిప్యూటీ చైర్మన్‌గా ఎన్నికైన బండా ప్రకాశ్‌కు మంత్రి పువ్వాడ శుభాకాంక్షలు తెలిపారు.

మండలి వైస్‌చైర్మన్‌కు ఎంపీ అభినందన..


బండ ప్రకాష్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఎంపీ రవిచంద్ర

ఖమ్మంమయూరిసెంటర్: తెలంగాణ రాష్ట్ర శాసనమండలి (లెజిస్లేటివ్ కౌన్సిల్) వైస్ చైర్మన్‌గా ఏకగ్రీవంగా ఎన్నికైన బండా ప్రకాష్‌ను రాజ్యసభ ఎంపీ వద్దిరాజు రవిచంద్ర అభినందించారు. ఆదివారం శాసనమండలిలో ఆయన వైస్ చైర్మన్‌గా ఎన్నికైన అనంతరం ఎంపీ రవిచంద్ర పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు చెప్పారు. విప్‌లుగా నియమితులైన శంభీపూర్ రాజు, పాడి కౌశిక్‌రెడ్డిని కూడా ఎంపీ రవిచంద్ర అభినందించారు.

ఆకట్టుకున్న సైన్స్ ఎక్స్‌పో


ప్రదర్శనలను తిలకిస్తున్న దృశ్యం

ఖమ్మంసహకారనగర్: రిక్కాబజార్ ప్రాంతంలోని సక్సెస్ స్కూల్‌లో ఆదివారం నిర్వహించిన సైన్స్ ఎక్స్‌పో కార్యక్రమం ఆకట్టుకుంది. ముఖ్య అతిథిగా స్థానిక కార్పొరేటర్ గోళ్ల చంద్రకళ హాజరై ప్రారంభించి మాట్లాడారు. విద్యార్థుల్లో దాగి ఉన్న నైపుణ్యం వెలికి తీసేందుకు ఎక్స్ పో దోహదపడుతుందన్నారు. కాగా, ఎక్స్‌పోను వివిధ పాఠశాలల యజమానులు గొల్లపుడి రాంప్రసాద్, సత్యనారాయణ, సందీప్ తదితరులు సందర్శించారు. కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ దేవరశెట్టి నాగేశ్వరరావు, టీచర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రం ప్రారంభం

ఖమ్మంఅర్బన్: మండలంలోని కామంచికల్ గ్రామంలో అంగన్‌వాడీ కేంద్రాన్ని ఆదివారం గ్రామ ఉప సర్పంచ్ బొప్పి ప్రభాకర్ ప్రారంభించారు. కార్యక్రమంలో మెదరమెట్ల శ్రీనివాసరావు, ప్రతాపనేని రఘు, సొసైటీ డైరెక్టర్ శ్రీనివాసరావు, కాలంగి ఉపేంద్ర, శేఖర్‌కృష్ణ, లక్ష్మి, జంగాల ఉపేందర్, నువ్వుల లక్ష్మయ్య, యాదాల లింగయ్య, సైదమ్మ పాల్గొన్నారు.

వివాహ వేడుకకు హాజరైన 'లక్కినేని'

ఖమ్మంమయూరిసెంటర్: రోండ్ల ప్రభాకర్‌రెడ్డి -అప్పమ్మ దంపతుల కుమార్తె వివాహానికి హాజరైన వైఎస్సార్ తెలంగాణ పార్టీ జిల్లా అధ్యక్షుడు లక్కినేని సుధీర్‌బాబు వధూవరులను ఆశీర్వదించారు. వైఎస్సార్‌టీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆలస్యం రవి,నగర అధ్యక్షుడు తుమ్మ అప్పిరెడ్డి, ఎస్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు రాంబాబు నాయక్, వీరు నాయక్, వీరన్న పాల్గొన్నారు.

అమెరికా అమ్మాయితో తెలుగబ్బాయి పెళ్లి


నూతన దంపతులను ఆశీర్వదిస్తున్న నాయకులు

తిరుమలాయపాలెం: విదేశాలలో ఉద్యోగం కోసం వెళ్లి అమెరికాలో స్థిరపడిన మండలంలోని తిరుమలాయపాలెం గ్రామానికి చెందిన కొండబాల కళాధర్–ఉమ దంపతుల కుమారుడు కొండబాల నిఖిల్ ఆ దేశానికి చెందిన కేరి అనే యువతిని ప్రేమించి గతేడాది వివాహం చేసుకున్నాడు. సంవత్సరం తర్వాత మాతృదేశంలో కుటుంబ సభ్యులు, స్నేహితుల నడుమ ఆదివారం ఖమ్మంలోని స్వర్ణభారతి కల్యాణ మండపంలో వివాహ వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. తెలుగు సంస్కృతి, సంప్రదాయాలను తన భార్య కేరికి చూపించగా పలువురు ప్రముఖులు, రాజకీయ పార్టీల నాయకులు, బంధువులు పాల్గొని ఇరువురిని ఆశీర్వదించారు.

నగరంలో సినిమాలు

తిరుమల	రైటర్ పద్మభూషణ్
వినోద	వారసుడు
సాయిరాం	వీరసింహారెడ్డి
ఆదిత్య	పఠాన్
శ్రీనివాస	వాల్తేరు వీరయ్య
సుందర్	అమిగోస్

- ఖమ్మంవ్యవసాయం

చక్కబడింది..


మామిళ్లగూడెం పాఠశాలలో విద్యార్థులు

కార్పొరేట్‌కు దీటుగా ప్రభుత్వ పాఠశాలలు

- నూతన హంగులతో సౌకర్యాల కల్పన
- బడికి వచ్చేందుకు ఆసక్తి కనబరుస్తున్న విద్యార్థులు
- డిజిటల్ బోధనతో చదువుపై పెరుగుతున్న శ్రద్ధ
- హర్షం వ్యక్తం చేస్తున్న తల్లిదండ్రులు

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన మన ఊరు –మన బడి, మన బస్తీ–మన బడి కార్యక్రమం ద్వారా పాఠశాలలు ముస్తాబయ్యాయి. కార్పొరేట్‌కు దీటుగా ప్రభుత్వ పాఠశాల్లోనూ సకల సౌకర్యాలు కల్పించి నాణ్యమైన విద్యను అందిస్తూ విద్యార్థులు పాఠశాలలకు వచ్చేందుకు ఆసక్తి కనబరిచేలా అధికారులు చర్యలు చేపట్టారు. డిజిటల్ తరగతులతో జరుగుతున్న విద్యా బోధనతో విద్యార్థుల్లో నూతనోత్సాహం నిండుతోంది. కాగా, నగరంలో ఇలా రూపాంతరం చెంది పునఃప్రారంభమైన పాఠశాలలపై 'సాక్షి'ప్రత్యేక కథనం.

ఖమ్మంసహకారనగర్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన మన బస్తీ–మన బడి కార్యక్రమం ద్వారా నగరంలోని శాంతినగర్ ఉన్నత పాఠశాల, మామిళ్లగూడెంలోని ప్రాథమిక పాఠశాలలు కొత్త రూపం దాల్చుకున్నాయి. కార్పొరేట్‌కు దీటుగా ప్రభుత్వ పాఠశాలలు నెలకొన్నాయి. గతంలో తాగునీరు, మరుగుదొడ్లు తదితర అరకొర సమస్యలతో అల్లాడగా.. ప్రభుత్వం తీసుకున్న ప్రత్యేక చొరవతో దాదాపు అన్ని పాఠశాలలు కొత్తగా రూపాంతరం చెందాయి. అన్ని తరగతులకు డిజిటల్ క్లాస్‌రూముల్లో బోధన జరుగుతుండగా.. కనీస సౌకర్యాలైన తాగునీరు, డ్యూయల్ డెస్క్‌లు, విద్యార్థులకు చదువుపై ఆసక్తిని పెంచేలా గోడలకు వాల్ పెయింటింగ్, ఆహ్లాదకరమైన బొమ్మలు, వంటగదులు, విద్యుత్ సౌకర్యం తదితర సౌకర్యాలను కల్పించి అటు విద్యార్థులను,ఇటు తల్లిదండ్రులను మైమరపించేలా అధికారులు తీర్చిదిద్దారు. శాంతినగర్ పాఠశాలకు రూ.1.14 కోట్లు, మామిళ్లగూడెం పాఠశాలకు రూ.12.49 లక్షల వరకు నిధులను కేటాయించి సుందరంగా తీర్చిదిద్దారు.

రూ.14.69 లక్షలతో అభివృద్ధి..



మా పాఠశాలను రూ.14.69 లక్షలతో అభివృద్ధి చేశారు. మన బస్తీ–మన బడి తొలివిడతలోనే మంత్రి అజయ్‌కుమార్ మా పాఠశాలను ప్రారంభించడం సంతోషంగా ఉంది. విద్యార్థులతో మంత్రి, కలెక్టర్ మాట్లాడి వారిలో నూతనోత్సాహం నింపారు.

– కె.వెంకటేశ్వర్లు, హెచ్‌ఎం, మామిళ్లగూడెం

చదువుపై శ్రద్ధ పెరుగుతోంది..



పాఠశాలలో కనీస సౌకర్యాలు కల్పించడంతో మాకు ఇబ్బందులు తొలగి చదువుపై శ్రద్ధ పెరిగే అవకాశం ఉంది. ఇప్పటి వరకు అనేక అసౌకర్యాల నడుమ చదువు కొనసాగించాం. ప్రస్తుతం ప్రైవేట్ పాఠశాలలో కూర్చున్నామనే భావన కలుగుతోంది.

– అంజలి, 5వ తరగతి విద్యార్థిని

పాఠశాల బాగుంది..



మా పాఠశాల వాతావరణం ఆహ్లాదకరంగా ఉంది. ఆవరణ రూపురేఖలు అంతా మారిపోయాయి. అన్ని సౌకర్యాలతో కూడిన ప్రైవేట్ పాఠశాలను తలపిస్తోంది. విద్యార్థులు చదువుకోవడానికి అవసరమైన అన్ని వసతులు ఇక్కడ లభిస్తున్నాయి.

– ఎస్.సిరి, 9వ తరగతి, శాంతినగర్, పాఠశాల

ఉచిత వైద్యాన్ని వినియోగించుకోండి


వైద్య పరీక్షలు చేస్తున్న దృశ్యం

నేలకొండపల్లి: మండల కేంద్రంలోని రావెళ్లభవన్‌లో నెలనెలా నిర్వహిస్తున్న వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని సీపీఎం జిల్లా నాయకులు ఏటుకూరి రామారావు కోరారు. ఆదివారం రావెళ్లభవన్‌లో నూతక్కి గంగాధర్‌రావు సేవా కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వైద్యశిబిరాన్ని డాక్టర్ అనుదీప్ ప్రారంభించగా రామారావు మాట్లాడారు. సేవా కమిటీ ఆధ్వర్యంలో అందిస్తున్న వైద్యసేవలు అభినందనీయమని పేర్కొన్నారు. శిబిరానికి సహకరించిన వసుంధర కాలేజీ యాజమాన్యం, విద్యార్థులకు ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో సిరికొండ ఉమామహేశ్వరి, కెవీ రెడ్డి, గుడవర్తి నాగేశ్వరరావు, కె.వెంకన్న, నరసింహారావు, సామాల మల్లికార్జున్ రావు తదితరులు పాల్గొన్నారు.

పోయిన బ్యాగు అందజేత


బ్యాగును అందజేస్తున్న ఆర్టీసీ కంట్రోలర్

ఖమ్మం మామిళ్లగూడెం: ఖమ్మం ఆర్టీసీ బస్టాండ్‌లో ప్రయాణికుల కుర్చీలో మర్చిపోయిన ఓ బ్యాగును ఆర్టీసీ అధికారులు బాధితుడికి ఆదివారం అందించారు. నేలకొండపల్లి మండలం బీసీ కాలనీకి చెందిన యరపంచి రమేష్ ఖమ్మం బస్టాండ్‌లో ల్యాప్‌ట్యాబ్, డాక్యుమెంట్లను ఓ బ్యాగ్‌లో పెట్టి మర్చిపోయి వెళ్లిపోయాడు. ఈక్రమంలో ఆర్టీసీ అధికారులు పోగొట్టుకున్న వ్యక్తికి ఫోన్ చేసి పోలీసుల సమక్షంలో అందించారు. బస్టాండ్ కంట్రోలర్ డి.హరిలాల్, బస్టాండ్ ఎలక్ట్రీషియన్ రంజాన్ తదితరులు పాల్గొన్నారు.

జర్నలిస్ట్ మృతికి సంతాపం


ప్రభాకర్ (ఫైల్)

నేలకొండపల్లి: మండల కేంద్రానికి చెందిన సీనియర్ జర్నలిస్ట్ పెందుర్తి ప్రభాకర్ (60) ఆదివారం మృతి చెందారు. నేలకొండపల్లిలో వివిధ ప్రతికల్లో రిపోర్టర్‌గా ఆయన పనిచేశారు. ప్రస్తుతం హైదరాబాద్‌లో ఓ దినపత్రికలో జర్నలిస్టుగా పనిచేస్తున్నారు. ఆయన మృతికి పలు జర్నలిస్టు యూనియన్ నాయకులు పోలంపల్లి నాగేశ్వరరావు, పీవీ నాగిరెడ్డి, మైసా శ్రీనివాసరావు, వడ్లమూడి వెంకటేశ్వర్లు, నున్నా లక్ష్మణ్, పి.శ్రీనివాసరెడ్డి, టి.ఉపేందర్, దండా శ్రీనివాసరావు, ఎన్‌డీ కర్ల, తోళ్ల బుచ్చాలు, పలు పార్టీల నాయకులు కాసాని నాగేశ్వరరావు, కడియాల నరేశ్ తదితరులు సంతాపం వ్యక్తం చేశారు.

పాపారావు కుటుంబసభ్యులకు కోదండరామ్..

ఖమ్మం మామిళ్లగూడెం: బీజేపీ రాష్ట్ర నాయకుడు, ప్రముఖ డాక్టర్ శీలం పాపారావు మాతృమూర్తి శీలం లక్ష్మి ఇటీవల అనారోగ్యంతో మృతిచెందింది. విషయం తెలుసుకున్న టీజేఎస్ రాష్ట్ర అధ్యక్షుడు ప్రొఫెసర్ కోదండరామ్ ఆదివారం పాపారావు నివాసానికి వెళ్లి లక్ష్మి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. టీజేఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు జంగిల్ రవి, వైరా ఇన్‌చార్జ్ సునావత్ రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

పదోన్నతులు కల్పించాలి

ఖమ్మం సహకారనగర్: రాష్ట్ర ప్రభుత్వం అప్‌గ్రేడ్ చేసిన పండిట్, పీఈటీ పోస్టులకు పదోన్నతులు కల్పించి వారు చేస్తున్న ఆందోళనను విరమింపజేయాలని టీఎస్ యూటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు చావా దుర్గాభవానీ డిమాండ్ చేశారు. ఆదివారం జీవీ నాగమల్లేశ్వరరావు అధ్యక్షతన ఆన్‌లైన్ ద్వారా జరిగిన జిల్లా కమిటీ సమావేశంలో ఆమె మాట్లాడారు. పదో తరగతి పరీక్షల నేపథ్యంలో పిల్లల విద్యాభ్యాసానికి నష్టం జరగకుండా చూడాల్సిన బాధ్యత ప్రభుత్వానిదేనన్నారు.కోర్టు తీర్పు త్వరగా వచ్చే విధంగా తగుచర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సమావేశంలో రాష్ట్ర నాయకులు షేక్.మహబూబ్ అలీ, జిల్లా ప్రధాన కార్యదర్శి పారుపల్లి నాగేశ్వరరావు, బుర్రి వెంకన్న, షమీ, వల్లంకొండ రాంబాబు, సుధాకర్, రాందాస్, నర్సయ్య, రమేష్, డి.నాగేశ్వరరావు, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

స్వీటు దొంగ..!

రఘునాథపాలెం: మండలంలోని వీవీపాలెం గ్రామ పరిధిలోని ఖమ్మం–వైరా ప్రధానరోడ్డు పక్కన దుకాణంలో గల ఓ స్వీటు దుకాణంలో చోరీ జరిగింది. వివరాలిలా ఉన్నాయి. రోజులాగే శనివారం దుకాణం మూసి వెళ్లిన తర్వాత కొందరు దుండగులు దుకాణంలోకి చొరబడి అందులోని స్వీటు ప్యాకెట్లు, బిస్కెట్లు, సిగరెట్లతో పాటు దుకాణం పక్కనే ఉన్న పంక్చర్‌షాపులో జాకీలను సైతం చోరీ చేశారు. ఈ విషయమై బాధితులు స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేయగా.. ఇద్దరు అనుమానితులను అదుపులోకి తీసుకున్నట్లు తెలిసింది.

పిల్లల్లో ధైర్యం నింపాల్సింది తల్లిదండ్రులే..


మందులు పంపిణీ చేస్తున్న శ్రీశైలం

ఖమ్మంవైద్యవిభాగం: చిన్నారుల్లో ఉన్న శారీరక, మానసిక సమస్యలు కుంగదీయకుండా వారిలో ధైర్యం నింపాల్సిన బాధ్యత తల్లిదండ్రులపై ఉందని రిజర్వ్ ఇన్‌స్పెక్టర్ ఎస్.శ్రీశైలం అన్నారు. ఆదివారం స్థానిక రితన్య ఆస్పత్రిలోని తలసేమియా డేకేర్ సెంటర్‌లో సంకల్ప స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో తలసేమియా చిన్నారులకు అర్‌బి చేతుల మీదుగా మందులను ఉచితంగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. తలసేమియాతో బాధపడుతున్న చిన్నారుల తల్లిదండ్రులు మనోధైర్యం కోల్పోవద్దని, చిన్నారుల ముందు తమలోని బాధను బయట పెట్టొద్దని పేర్కొన్నారు. 'సంకల్ప' సేవలు అభినందనీయమని, సంస్థకు అండగా పోలీస్ శాఖ ఉంటూ వస్తోందని, చిన్నారులకు ఎప్పుడు రక్తం అవసరమైనా తమ శాఖలో పని చేసే అధికారుల నుంచి సిబ్బంది వరకు అంతా ముందుకు వస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో ప్రొద్దుటూరి రవిచంద్ర, బోస్ రాజ్, కుమార్, ప్రొద్దుటూరి అనిత, నెల్లూరి ఉపేందర్, డి.రాములునాయక్, వీణ, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

రఘునాథపాలెం: మండలంలోని కామంచికల్ గ్రామపంచాయతీలో విద్యుత్ లైన్ల మరమ్మతుల దృష్ట్యా సోమవారం పంచాయతీలో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని విద్యుత్‌శాఖ ఏఈ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. లైన్ల పరిధిలో పెరిగిన చెట్ల కొమ్మలను తొలిగించేందుకు ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు అంతరాయం ఉంటుందని, వినియోగదారులు సహకరించాలని విద్యుత్ అధికారులు కోరారు.

108లో ప్రసవం..

ఖమ్మంవైద్యవిభాగం: ఓ గర్భిణి 108 వాహనంలో ప్రసవించిన ఘటన శనివారం అర్ధరాత్రి నగరంలో చోటుచేసుకుంది. ఖమ్మరూరల్ మండలం రామన్నపేటకు చెందిన గర్భిణి ఓబుల శ్రుతి (20) శనివారం అర్ధరాత్రి ఒంటి గంట సమయంలో నొప్పులు ప్రారంభమయ్యాయి. కుటుంబ సభ్యులు 108కు ఫోన్ చేయడంతో వారు అక్కడికి చేరుకున్నారు. గర్భిణిని ఎక్కించుకొని బయలుదేరగా మధ్యలో ఎఫ్‌సీఐ గొడౌన్ వద్దకు రాగానే నొప్పులు ఎక్కువయ్యాయి. వాహనాన్ని పక్కకు ఆపి సిబ్బంది ప్రసవం చేయగా పాపకు జన్మనిచ్చింది. అనంతరం పుట్టిన శిశువును, బాలింతను జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి అత్యవసర చికిత్స అందించారు. ప్రసవం చేసిన తుమ్మ జగదీశ్, రాంప్రసాద్‌ను బాలింత కుటుంబ సభ్యులు అభినందించారు.

మాజీ మంత్రి పర్యటన

కూసుమంచి: మండలంలోని పలు గ్రామాల్లో మాజీ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆదివారం పర్యటించారు. ఈశ్వరమాధారం, హీరామాన్‌తండాల్లో జరిగిన వివాహ వేడుకల్లో పాల్గొన్నారు. ఈశ్వరమాధారంలో ఉపసర్పంచ్ మండడి రాంరెడ్డి, పద్మ దంపతుల కుమారుడు దినేశ్‌రెడ్డి–శ్రావణి వివాహానికి హాజరై వధూవరులను ఆశీర్వదించారు. హీరామాన్ తండాలో అజ్మీరా జాను, జ్యోతి కుమార్తె రూప–ఆదిత్య వివాహ వేడుకల్లో పాల్గొన్నారు. యాకులు జూకూరి గోపాలరావు, మాదాసు ఉపేందర్, బి.సుధాకర్‌రెడ్డి, ఎడవెల్లి ముత్తయ్య, రేల వెంకటరెడ్డి, మీరాసాహెబ్ తదితరులు ఉన్నారు.

కేఏ పాల్ ఫ్లెక్సీకి క్షీరాభిషేకం


క్షీరాభిషేకం చేస్తున్న పార్టీ కార్యకర్తలు

ఖమ్మం మామిళ్లగూడెం: ప్రజాశాంతి పార్టీ వ్యవస్థాపకుడు డాక్టర్ కేఏ పాల్ ఫ్లెక్సీకి ఖమ్మం జెడ్పీ సెంటర్‌లోని అంబేడ్కర్ విగ్రహం ఎదుట ఆదివారం ఆ పార్టీ కార్యకర్తలు క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఆపార్టీ జిల్లా కోఆర్డినేటర్ కర్రి నాగరాజు మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్ పుట్టిన రోజునే హైదరాబాద్‌లోని సెక్రటేరియట్‌ను ఓపెన్ చేయాలనే స్వార్థపూరిత ఆలోచనను కేఏ పాల్ హైకోర్టులో పిటిషన్ వేసి నిలుపుదల చేసినందుకు గాను కృతజ్ఞతగా క్షీరాభిషేకం చేసినట్లు తెలిపారు. బంగారు తెలంగాణ కావాలంటే కేఏ పాల్ అధికారంలోకి రావాలన్నారు. జిల్లా నాయకులు గిరి, సుధాకర్, కార్యకర్తలు పాల్గొన్నారు.

నిర్దిష్ట సమయం ప్రకటించాలి..


సమావేశంలో పాల్గొన్న నాయకులు

ఖమ్మంమయూరిసెంటర్: వ్యవసాయ విద్యుత్ సరఫరాకు సంబంధించి నిర్దిష్ట సమయం ప్రకటించాలని తెలంగాణ రైతు సంఘం జిల్లా కార్యదర్శి బొంతు రాంబాబు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక మంచికంటిహాల్‌లో తెలంగాణ రైతు సంఘం జిల్లా అధ్యక్షులు మాదినేని రమేశ్ అధ్యక్షతన జరిగిన సంఘం జిల్లా విస్తృతస్థాయి సమావేశంలో ఆయన మాట్లాడారు. విద్యుత్ సరఫరా సమయం పూటకో మాదిరిగా ఉందని, రోజుకో తీరుగా సరఫరా సమయం మారడం వల్ల రైతులు తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారన్నారు. వ్యవసాయానికి అవసరమైన విద్యుత్ సరఫరా చేసి పంటలు ఎండిపోకుండా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు వేగవంతం చేయాలని కోరారు. సాగర్ ఆయకట్టు భూములకు సాగునీరు అందించాలని సూచించారు. సమావేశంలో దుగ్గి కృష్ణ, ఎస్కే మీరా, చింతనిప్పు చలపతిరావు, గొడవర్తి నాగేశ్వరరావు, రచ్చా నరసింహారావు, రావుల రాజాబాబు, చెరకుమల్లి కుటుంబరావు, శీలం సత్యనారాయణరెడ్డి, ఊరడి సుదర్శన్‌రెడ్డి, మందా సైదులు పాల్గొన్నారు.

ప్రేమికులకు రక్షణ కల్పిస్తాం..


మాట్లాడుతున్న రామకృష్ణ

ఖమ్మంమయూరిసెంటర్: వాలెంటైన్స్ డే సందర్భంగా ప్రేమికులపై దాడులకు పాల్పడుతున్న మతోన్మాదులను తరిమికొడగామని ఏఐఎస్‌ఎఫ్ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఇటికా రామకృష్ణ స్పష్టం చేశారు. ఆదివారం స్థానిక గిరిప్రసాద్‌భవన్‌లో ఏఐఎస్‌ఎఫ్ ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. దేశంలోని విశ్వవిద్యాలయాల్లో చదువుకుంటున్న విద్యార్థులు ప్రజాస్వామ్యబద్ధంగా.. రాజ్యాంగం కల్పించిన హక్కుతో కులాంతర, మతాంతర, కులాంతర వివాహాలు చేసుకుంటున్నారని, అలాంటి వారిని లక్ష్యం చేసుకుని మతోన్మాదశక్తులు, ఆర్‌ఎస్‌ఎస్, భజరంగ్‌దళ్, ఏబీవీపీ వారు దాడు చేస్తున్నారన్నారు. ఇలాంటి వాటిని తాము సహించబోమని హెచ్చరించారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు ధర్మవరపు యువరాజు, సతీశ్, జిల్లా నాయకులు బిట్టు, చందులాల్, వెంకటేశ్, గోపి, నరేందర్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పాలనను కోరుకుంటున్నారు


వృద్ధులతో మాట్లాడుతున్న రాయల నాగేశ్వరరావు

కూసుమంచి: రాష్ట్రంలో, కేంద్రంలో రానున్న ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడం ఖాయమని టీపీసీసీ సభ్యులు రాయల నాగేశ్వరరావు అన్నారు. ఆదివారం మండలంలోని మల్లేపల్లి గ్రామంలో నిర్వహించిన హాథ్ సే హాథ్ జోడో యాత్ర కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఇంటింటికీ తిరిగి కాంగ్రెస్ నేత రాహుల్‌గాంధీ భారత్ జోడోయాత్రలో ఇచ్చిన సందేశాన్ని వివరించారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో పేదలు ఎంతో సంతోషంగా ఉన్నారని పేర్కొన్నారు. పేదలు, బడుగు బలహీన వర్గాల ప్రజలు కాంగ్రెస్ పాలనను కోరుకుంటున్నారని చెప్పారు. కాంగ్రెస్ కార్యకర్తలు, ప్రజలు కాంగ్రెస్‌ను అధికారంలోకి తీసుకురావాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు మట్టె గురువయ్య, నాయకులు మంకెన వాసూ, వీరభద్రం, లచ్చూనాయక్ తదితరులు పాల్గొన్నారు.

పంటల గిట్టుబాటు ధరకు చట్టం తేవాలి


మాట్లాడుతున్న గుర్రం అచ్చయ్య

తిరుమలాయపాలెం: రైతు పండించిన పంటలకు గిట్టుబాటు ధర గ్యారంటీ చట్టం తేవాలని అఖిల భారత రైతు కూలీ సంఘం రాష్ట్ర నాయకుడు గుర్రం అచ్చయ్య డిమాండ్ చేశారు. ఆదివారం మండలంలోని దమ్మాయిగూడెంలో జరిగిన సమావేశంలో పాల్గొని మాట్లాడారు. ఉపాధి కూలీలకు 200 రోజుల పనిదినాలు కల్పించి రోజుకు రూ.600 ఇవ్వాలని డిమాండ్ చేశారు. విద్యుత్ కోతలు లేకుండా అంతరాయం లేని విద్యుత్‌ను అందించాలని కోరారు. రాష్ట్ర బడ్జెట్‌లో రైతాంగాన్ని విస్మరించిందని ఆరోపించారు. కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న రైతాంగ వ్యతిరేక విధానాలపై పోరాటాలు సాగించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు బందెల వెంకయ్య, మలీదు నాగేశ్వరరావు, శివలింగం, కమ్మకోమటి నాగేశ్వరరావు, మల్లయ్య, యాదగిరి, వెంకన్న, వెంకటప్పారావు, సోమనపల్లి వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

కరెంట్ కోతలపై వైఎస్సార్‌టీపీ ఆందోళన


ఆందోళన చేస్తున్న వైఎస్సార్‌టీపీ నాయకులు

కామేపల్లి (కారేపల్లి): రైతులకు 24 గంటల ఉచిత కరెంట్ అందిస్తామని చెప్పి కరెంట్ కోతలతో రైతులను ఇబ్బందులకు గురి చేస్తున్న కేసీఆర్ పాలన దగాకోరు పాలనని మహబూబాబాద్ జిల్లా వైఎస్సార్‌టీపీ అధ్యక్షురాలు, ఇల్లెందు నియోజకవర్గ నాయకురాలు బాణోతు సుజాతమంగీలాల్ అన్నారు. ఆదివారం మండల పరిధిలోని కొత్తలింగాల విద్యుత్ ఉపకేంద్రం ఎదుట వైఎస్సార్‌టీపీ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. విద్యుత్ కోతలతో రైతుల పంటలు ఎండిపోతున్నాయని, పంటలు నష్టపోయిన రైతాంగానికి పరిహారం చెల్లించాలని ఆమె డిమాండ్ చేవారు. అంతేకాక ఏసీడీ అదనపు చార్జీలతో ప్రజలపై అదనపు భారం వేసి, వారిని ఆర్థిక ఇబ్బందులకు గురి చేస్తున్నారని చెప్పారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి నాణ్యమైన కరెంట్ అందించాలని లేనిపక్షంలో రైతుల పక్షాన ప్రత్యక్ష ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌టీపీ మండల అధ్యక్షుడు సత్తిరెడ్డి, నాయకులు గుండ్ల రమేష్, ఎస్‌కె.ఫైజుద్దీన్, చింతల శ్రీను తదితరులు పాల్గొన్నారు.

నాసా పోటీల్లో ఖమ్మం చిన్నారి ప్రతిభ

ఖమ్మంసహకారనగర్: అమెరికాకు చెందిన అంతరిక్ష పరిశోధన సంస్థ (నాసా) ఆధ్వర్యంలో అమెరికా సంయుక్త రాష్ట్రాల్లోని విద్యార్థులకు నిర్వహించిన 'నాసా టెక్ రైస్ చాలెంజ్'పోటీల్లో ఖమ్మానికి చెందిన విద్యార్థిని చావా కావ్యరచన ప్రతిభ కనబర్చింది. ఈ పోటీల్లో కొన్ని వందల టీమ్‌లు పాల్గొనగా.. 60 టీమ్‌లను ఎంపిక చేయగా అందులో కావ్యరచన టీమ్ కూడా ఉంది. నగరంలోని గట్టయ్యసెంటర్‌కు చెందిన చావా రమేశ్‌బాబు, సంపూర్ణ కుమారుడు చావా కృష్ణచైతన్య, మాధవి దంపతులు అమెరికాలో ఉంటుండగా వారి కుమార్తె కావ్యరచన పోటీల్లో పాల్గొని గెలుపొందింది.

బీజేపీ అధికారంలోకి రావడం ఖాయం

కిసాన్ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు కొండపల్లి శ్రీధర్‌రెడ్డి


మాట్లాడుతున్న కొండపల్లి శ్రీధర్‌రెడ్డి

నేలకొండపల్లి: రాష్ట్రంలో ఉద్యోగులకు వేతనాలు ఇవ్వలేని ముఖ్యమంత్రి కేసీఆర్.. దేశాన్ని ఎలా ఉద్ధరిస్తారని కిసాన్ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు కొండపల్లి శ్రీధర్‌రెడ్డి ప్రశ్నించారు. మండలంలోని బోదులబండ శక్తి కేంద్రంలో ప్రజాగోస–బీజేపీ భరోసా కార్యక్రమంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. రాష్ట్రంలో అన్ని వర్గాల ప్రజల గోడును పట్టించుకోకుండా.. బీఆర్ఎస్ పేరుతో ఇతర రాష్ట్రాలను ఉద్ధరిస్తానని తిరగటం హాస్యాస్పదంగా ఉందని పేర్కొన్నారు. ముందుగా రాష్ట్రంలో నెలకొన్న ప్రజాసమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. రానున్న ఎన్నికల్లో బీఆర్ఎస్‌కు తగిన గుణపాఠం తప్పదని, బీజేపీ అధికారంలోకి రావడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. రాష్ట్రవ్యాప్తంగా 11 వేల శక్తి కేంద్రాల ద్వారా ప్రజాగోస–బీజేపీ భరోసా కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. నున్నా రవికుమార్, అనంతు ఉపేందర్‌గౌడ్, తక్కెళపల్లి రవీందర్‌రావు, రామ్మోహన్‌రెడ్డి, సంతోష్‌రెడ్డి, కోటి హనుమంతరావు, మన్నె కృష్ణారావు, మోహినుద్దీన్, మీగడ గోపి, సూరేపల్లి జ్ఞానరత్నం తదితరులు పాల్గొన్నారు.